నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
08.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
12 జూన్ 2024
పేజీలు 8

### ప్రవాహ సాఫ్ట్‌వేర్

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఈ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. పీఆర్‌ఏవీఏహెచ్‌ఏ పూర్తి రూపం- ప్యారలల్ ఆర్‌ఏఎన్‌ఎస్ సాల్వర్ ఫర్ ఏరోస్పేస్ వెహికిల్ ఏరో-థర్మో-డైనమిక్ అనాలసిస్. ఇది అంతరిక్షంలోకి వెళ్లే వాహక నౌకలు, పునర్ ప్రవేశించిన వాటి వాయు వేగాలు, ఉష్ణం తదితర అంశాలను గణించేందుకు రూపొందించిన ఒక సాఫ్ట్‌వేర్ డిజైన్ టూల్.

## రోజులు

**జూన్ 6**

- ఏటా జూన్ 6న యూఎన్ రష్యా భాష రోజుగా నిర్వహిస్తారు. పారిస్ కేంద్రంగా పని చేసే యునెస్కో ఈ రోజును ఏర్పాటు చేసింది. రష్యా భాష ఉన్నతికి కృషి చేస్తారు.

**జూన్ 5**

- ఏటా జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ ఏడాది ఇతివృత్తం 'భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరవు నివారణ'. 1972, జూన్ 5న ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం ఏర్పాటయ్యింది. అందుకే ఈ రోజునే ప్రపంచ పర్యావరణ రోజుగా నిర్వహిస్తున్నారు. ఈ సంస్థ ప్రధాన కార్యాలయం కెన్యాలోని నైరోబిలో ఉంది. అలాగే ప్రతి సంవత్సరం జూన్ 5న అక్రమ, అనియంత్రిత చేపలు పట్టడాన్ని వ్యతిరేకించే రోజుగా కూడా నిర్వహిస్తారు. జల వ్యవస్థల్లో జీవ వైవిధ్యాన్ని రక్షించడం ఇందులో ప్రధానాంశం.

**జూన్ 2**

- తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటైన రోజు. 2014 నవంబర్ 2న 29వ రాష్ట్రంగా తెలంగాణ అవతరించింది. 1969లో తొలి విడతలో తెలంగాణ ఉద్యమం సాగింది. అయితే నాటి ప్రభుత్వం దీన్ని విజయవంతంగా అడ్డుకోగలిగింది. 2009లో మలిదశలో కేసీఆర్ నేతృత్వంలో ఈ ఉద్యమం తారాస్థాయికి చేరింది. అన్ని వర్గాలను కలుపుకొని వెళ్లిన కేసీఆర్, పార్లమెంట్ చట్టం ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు.

**జూన్ 1**

- ఏటా జూన్ 1న ప్రపంచ పాల రోజుగా నిర్వహిస్తారు. పాల ప్రాధాన్యాన్ని తెలియజేసేందుకు ఉద్దేశించింది. భారత్‌లో నవంబర్ 26న జాతీయ పాల రోజు ఉంటుంది.

## జాతీయం

**సంకీర్ణ కూటమి**



- లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో కేంద్రంలో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాలేదు. భారతీయ జనతా పార్టీ 240 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఎన్నికలకు ముందే ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాలతో కూటమిని ఏర్పాటు చేసింది. ఈ కూటమికి 290కి పైగా స్థానాలు దక్కాయి. ఈ కూటమి తమ నాయకుడిగా నరేంద్రమోదీని ఎన్నుకోవడంతో తిరిగి ఆయనే ప్రధానిగా బాధ్యతలను చేపట్టనున్నారు. కూటమిలో బీజేపీ అతి ఎక్కువ స్థానాలతో తొలి స్థానంలో ఉండగా, తెలుగు దేశం పార్టీ రెండో స్థానంలో ఉంది. ఎన్నికల ఫలితాల అనంతరం 17వ లోక్‌సభ రద్దుకు కేంద్ర క్యాబినెట్ సూచించింది. ఆ లోక్‌సభను రాష్ట్రపతి రద్దు చేశారు. లోక్‌సభలో రెండో అతిపెద్ద పార్టీగా భారత జాతీయ కాంగ్రెస్ నిలిచింది. ఆ పార్టీకి 99 స్థానాలు దక్కాయి. ప్రధాన ప్రతిపక్ష హోదాను పొందింది. లోక్‌సభతో పాటు వివిధ రాష్ట్రాల శాసన సభలకు జరిగిన ఎన్నికల ఫలితాలు కూడా వెలువడ్డాయి. ఆంధ్రప్రదేశ్‌లో మూడు పార్టీలతో కూడిన ఎన్‌డీఏ కూటమి విజయం సాధించింది. అక్కడ మొత్తం 175 స్థానాలు ఉండగా కూటమి 164 స్థానాల్లో గెలుపొందింది. ఇప్పటిదాకా అధికారంలో ఉన్న వైఎస్‌ఆర్‌సీపీ 11 స్థానాలకే పరిమితం అయింది. ఆ రాష్ట్ర శాసనసభలో మూడో అతిపెద్ద పార్టీగా ఉంది. తెలుగు దేశం 135 స్థానాలు పొందగా, 21 స్థానాల్లో పోటీ చేసిన జనసేన అన్నింటిలో గెలిచింది.
- తెలంగాణలో లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో ఎనిమిది స్థానాల్లో భారతీయ జనతా పార్టీ, మరో ఎనిమిది స్థానాల్లో కాంగ్రెస్, ఒక స్థానంలో ఎంఐఎం గెలిచాయి.

**ఇతర రాష్ట్రాల్లో..**

- ఒడిశాలో భారతీయ జనతా పార్టీ అధికారాన్ని చేపట్టనుంది. ఆ రాష్ట్రంలో మొత్తం 147 శాసనసభ స్థానాలుండగా భారతీయ జనతా పార్టీ 78 స్థానాల్లో విజయం సాధించింది. అరుణాచల్‌ప్రదేశ్‌లోనూ బీజేపీ విజయం సాధించింది. అక్కడ మొత్తం 60 శాసనసభ స్థానాలుండగా 46 స్థానాల్లో బీజేపీ గెలిచింది. 32 శాసనసభ స్థానాలున్న సిక్కిం శాసనసభలో అత్యధిక స్థానాలను సిక్కిం క్రాంతికారి మోర్చా గెలుచుకుంది. 31 స్థానాల్లో విజయం సాధించింది.

**నిమ్‌హాన్స్**



- బెంగళూర్ కేంద్రంగా పనిచేసే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ న్యూరో సైన్సెస్ సంస్థకు నెల్సన్ మండేలా అవార్డ్ దక్కింది. వైద్య పరిరక్షణలో చూపిన చొరవకు 2024 సంవత్సరానికి ఆ సంస్థ ఈ అవార్డ్‌ను గెలుచుకుంది.

**రికార్డ్ స్థాయిలో ఓటర్లు**

- ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా దేశంలో 64.2 కోట్ల మంది ఈసారి ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జీ7 దేశాలన్నీ కలిపి ఉన్న ఓటర్ల కంటే ఇది 1.5 రెట్లు ఎక్కువ. 31.2 కోట్ల మంది మహిళలు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రపంచంలోనే ఇంత భారీ స్థాయిలో మహిళలు ఓటు వేయడం ఇదే ప్రథమం.

**బ్యాంక్ క్లినిక్**

- బ్యాంక్ క్లినిక్ పేరుతో అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల సంస్థ ఒక ఫిర్యాదు వేదికను ప్రారంభించింది. వినియోగదారుల ఇబ్బందులను తొలగించేందుకు ఇది ఉపయోగపడుతుంది. బ్యాంక్ క్లినిక్ అనేది ఒక వెబ్‌సైట్. వినియోగదారులు తమ ఫిర్యాదులను దీనిలో చేయవచ్చు.

**జాతీయ మానవ హక్కుల సంఘం**

- మానవ అక్రమ రవాణాలను అడ్డుకొనేందుకు ప్రతి రాష్ట్రంలో ఒక నోడల్ అధికారిని నియమించాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ అన్ని రాష్ట్రాలకు సిఫారసు చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 23 కూడా మానవ అక్రమ రవాణా అన్నది ప్రాథమిక హక్కుల ఉల్లంఘనగా ప్రకటించింది.

**ఎఫ్‌డీఐలు**

- 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2023-24లో ఎఫ్‌డీఐలు 3.49% తగ్గాయని డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రి అండ్ ఇంటర్నల్ ట్రేడ్ ప్రకటించింది. అత్యధికంగా ఎఫ్‌డీఐలను ఆకర్షించిన రాష్ట్రాల జాబితాలో మహారాష్ట్ర, గుజరాత్, కర్నాటక వరుసగా 1, 2, 3 స్థానాల్లో ఉన్నాయి. భారత్‌కు అత్యధికంగా సింగపూర్ నుంచి ఎఫ్‌డీఐలు వచ్చాయి. ఆ తర్వాత వరుసగా మారిషస్, యూఎస్‌ఏ ఉన్నాయి. 2000-24 మధ్య కాలంలో భారత్‌కు అత్యధికంగా పెట్టుబడులు తీసుకొచ్చిన దేశాలు వరుసగా మారిషస్, సింగపూర్, యూఎస్‌ఏ, నెదర్లాండ్స్, జపాన్ ఉన్నాయి.

## అంతర్జాతీయం

**ఐక్యరాజ్యసమితి**




- వరల్డ్ సమ్మిట్ ఆన్ ది ఇన్ఫర్మేషన్ సొసైటీ అవార్డును భారత్‌కు చెందిన సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ సంస్థకు ప్రకటించారు. సామాజిక మార్పునకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నందుకు ఈ అవార్డ్ దక్కింది. వరల్డ్ సమ్మిట్ ఆన్ ది ఇన్ఫర్మేషన్ సొసైటీ వ్యవస్థను ఐక్యరాజ్యసమితి ఏర్పాటు చేసింది. ఏ విధంగా సమాచార సాంకేతిక పరిజ్ఞానం, సమాజానికి మేలు చేస్తుందో అధ్యయనం చేసేందుకు ఉద్దేశించింది. అలాగే సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్ అనే వ్యవస్థను భారత్‌లో 2024, ఆగస్ట్ 25న ఏర్పాటు చేశారు.

**యూఎన్‌ఎస్‌సీ**

- ఐక్యరాజ్యసమితికి ఉన్న ఆరు అంగాల్లో ఒకటి భద్రతా మండలి. ఇందులో 15 దేశాలకు సభ్యత్వం ఉంది. ఇరాక్‌కు సంబంధించి ఒక కీలక తీర్మానం చేయడం ద్వారా భద్రతా మండలి వార్తల్లో నిలిచింది. ఇరాక్‌లో చేపట్టిన మిషన్‌ను ముగిస్తూ తీర్మానాన్ని ఆమోదించింది. 2003లో 'యూఎన్‌ఏఎంఐ' పేరుతో ఈ మిషన్ ప్రారంభమయ్యింది. దీని పూర్తి రూపం- యునైటెడ్ నేషనల్స్ అసిస్టెన్స్ మిషన్ ఇన్ ఇరాక్. శాంతిభద్రతల కోసం అప్పట్లో దీన్ని ప్రారంభించారు. దీని పూర్తి కార్యకలాపాలు 2025, డిసెంబర్ 31 నాటికి ముగియనున్నాయి.

**ప్రపంచ బ్యాంక్**

- ప్రపంచ వ్యాప్తంగా 176 దేశాల ఆర్థిక వ్యవస్థలను పరిశీలించి ర్యాంకులను ప్రకటించారు. ప్రపంచ బ్యాంక్‌లోని ఇంటర్నేషనల్ కంపారిజన్ ప్రోగ్రామ్ దీన్ని చేపడుతుంది. కొనుగోలు శక్తి ఆధారంగా (పీపీపీ- పర్చేజింగ్ పవర్ పారిటీ) దీన్ని గణిస్తారు. తాజా అధ్యయనంలో ప్రపంచ వ్యాప్తంగా జీడీపీ పరంగా చైనా అగ్రస్థానంలో ఉంది. రెండో స్థానంలో అమెరికా ఉండగా, మూడో స్థానంలో భారత్ నిలిచింది. భారత జీడీపీ పీపీపీ పద్ధతిలో లెక్కిస్తే 11 ట్రిలియన్ డాలర్లు ఉంది. ప్రపంచ జీడీపీలో ఇది 7.2% ఉంది.




**బయో ఫార్మాస్యూటికల్ అలయన్స్**



- బయో ఫార్మాస్యూటికల్ రంగంలో గొలుసు సరఫరాను ఏర్పాటు చేసేందుకు భారత్, దక్షిణ కొరియా, జపాన్, అమెరికా, యూరోపియన్ యూనియన్ నిర్ణయించాయి. ప్రపంచంలో అతిపెద్ద బయో ఫార్మాస్యూటికల్ ప్రదర్శన కాలిఫోర్నియాలోని శాన్‌డియాగోలో నిర్వహించారు. అక్కడే ఈ దేశాలు అవగాహనకు వచ్చాయి. విశ్వసనీయమైన, సుస్థిరమైన గొలుసు సరఫరా ఉండాలని నిర్ణయించాయి.

**ప్రపంచ ఆరోగ్య సంస్థ**

- అవయవ దాన లభ్యతకు సంబంధించి ఒక ముసాయిదా తీర్మానాన్ని 77వ ప్రపంచ ఆరోగ్య సమావేశం రూపొందించింది. ప్రపంచ వ్యాప్తంగా ఒక పక్కా ప్రణాళిక రూపొందించాలన్నది ఇందులో సారాంశం. 2026 నాటికి తీర్మానం చేసేందుకు వీలుగా ఈ ముసాయిదాను ప్రకటించారు.

**రష్యా**

- భారత్‌కు అత్యధికంగా చమురును విక్రయిస్తున్న దేశాల జాబితాలో రష్యా అగ్రస్థానంలో ఉంది. ఆ దేశం ఈ స్థానంలో ఉండటం వరుసగా ఇది రెండో ఏడాది.

**కొరియా ఏరోస్పేస్ అడ్మినిస్ట్రేషన్**




- కొరియా ఏరోస్పేస్ అడ్మినిస్ట్రేషన్ ఏర్పాటును దక్షిణ కొరియా దేశం ప్రకటించింది. ఆ దేశంలో సచియన్ అనే ప్రదేశంలో దీని ప్రధాన కేంద్రం ఉంది. అంతరిక్ష పరిశోధనకు ఉద్దేశించిన సంస్థ ఇది.

**స్లొవేకియా**

- రాజ్యంగా గుర్తిస్తున్న దేశాల జాబితా పెరుగుతుంది. ఇప్పటికే స్పెయిన్, ఐర్లాండ్, నార్వే దేశాలతో పాటు స్వీడన్, హంగేరీ పాలస్తీనాను ఒక రాజ్యంగా గుర్తించాయి. తాజాగా ఈ జాబితాలో స్లొవేకియా కూడా చేరింది. భారత్ పాలస్తీనాను 1988లోనే ఒక స్వతంత్ర దేశంగా ప్రకటించింది.

## వార్తల్లో వ్యక్తులు

**సునీతా విలియమ్స్**



- బోయింగ్‌కు చెందిన స్టార్‌లైనర్ స్పేస్‌క్రాఫ్ట్ ద్వారా సునీతా విలియమ్స్ మరోసారి అంతరిక్షానికి బయలుదేరింది. ఈ అంతరిక్ష నౌకకు ఆమె పైలట్‌గా ఉన్నారు. ఒక స్పేస్‌క్రాఫ్ట్ తొలిసారి అంతరిక్షానికి వెళుతున్నప్పుడు ఒక మహిళ పైలట్‌గా ఉండడం ఇదే తొలిసారి. ఆమెతో పాటు ఇందులో విలియమ్స్ బారి బుచ్ అనే మరో వ్యోమగామి కూడా ఉన్నారు. భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్ ఇప్పటికే రెండు సార్లు అంతరిక్ష యానం చేశారు.

**ఒలెగ్ కొనొనెంకో**

- రష్యాకు చెందిన వ్యోమగామి ఒలెగ్ కొనొనెంకో 1000 రోజులు అంతరిక్షంలో ఉన్నారు. అంతర్జాతీయ స్పేస్ స్టేషన్‌లో ఉన్న ఆయన అక్కడ సుదీర్ఘకాలం ఉన్న వ్యక్తిగా రికార్డ్ నమోదు చేశారు.

**క్లాడియా షీన్‌బామ్**



- మెక్సికో అధ్యక్షురాలిగా క్లాడియా షీన్‌బామ్ ఎన్నికయ్యారు. ఆ దేశంలో ఈ బాధ్యతను చేపట్టనున్న తొలి మహిళ ఆమె.

**సుశీల్ కుమార్**

- దీన్‌దయాళ్ పోర్ట్ అథారిటీకి చైర్‌పర్సన్‌గా సుశీల్ కుమార్‌ను నియమించారు.

**హెలెన్ మేరీ**

- పాకిస్థాన్ సైన్యంలో వైద్యురాలిగా ఉన్న హెలెన్ మేరీ రాబర్ట్స్‌కు బ్రిగేడియర్‌గా పదోన్నతి కల్పించారు. ఆ దేశంలో ఈ స్థాయిని పొందిన తొలి క్రైస్తవ మహిళ అధికారిగా ఆమె రికార్డ్ సృష్టించారు.

**పీవీ సింధు**

- పొగాకు నియంత్రణ కోసం చేపట్టే కార్యక్రమాలకు ప్రచారకర్తగా బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు నియమితులయ్యారు.

**శేషు మాధవ్**

- మూడు దశాబ్దాలుగా వరి, పొగాకు పంటల పరిశోధన సంస్థకు డైరెక్టర్‌గా ఉన్న వ్యవసాయ శాస్త్రవేత్త మాగంటి శేషు మాధవ్‌కు జాతీయ వ్యవసాయ శాస్త్రాల అకాడమీ అత్యున్నత పురస్కారం దక్కింది.



వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411

